

సప్లిమెంటరీ పరీక్షకు 69 మంది గైర్హాజరు

వికారాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. బుధవారం జరిగిన ద్వితీయ భాష పరీక్షకు 127 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, వారిలో 58 మంది మాత్రమే హాజరు కాగా, 69 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ పరీక్షకు హాజరైన విద్యార్థుల కంటే గైర్హాజరైన విద్యార్థులు ఎక్కువగా ఉండడం గమనార్హం.

బీఆర్ఎస్ పార్టీకి తెలుగుదేశం పరిస్థితి రానుందా..? క్రమంగా ఆ పార్టీ తన ప్రాభావాన్ని కోల్పోతుందా? అన్న చర్చ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో సర్వత్రా సాగుతోంది. పది సంవత్సరాల పాటు అధికారంలో ఉన్న పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం తర్వాత భారీగా ఓట్లను కోల్పోవడం, పార్లమెంట్ ఎన్నికల్లో మరింత భారీగా ఓట్లకు గండిపడడంతో ఆ పార్టీకి ఇక మనుగడ కష్టమేనని అంతా భావిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైనా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఆ పార్టీ మెజారిటీ ఎమ్మెల్యే స్థానాలను, ఓట్లను సాధించింది. కానీ, పార్లమెంట్ ఎన్నికల నాటికి ఆ పార్టీకి ఒక్క సీటూ రాకపోవడంతో పాటు ఏకంగా 11.66లక్షల ఓట్లు కోల్పోయిందంటే పరిస్థితి ఎంత దారుణంగా తయారైందో అర్థమవుతోంది.





వాడిన గులాబీ

టీడీపీ తరహాలోనే బీఆర్ఎస్ పతనం

- 11.66లక్షల ఓట్లు కోల్పోయిన బీఆర్ఎస్
- తాజా పరిణామాలతో ఎమ్మెల్యేల పక్కచూపులు
- చేవెళ్ల, మల్కాజిగిరి స్థానాలను కైవసం చేసుకున్న బీజేపీ

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

ఉమ్మడి జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలు బీజేపీకి కలిసి రాగా ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ ఆశలు గల్లంతు చేశాయి. చేవెళ్ల, మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు బీఆర్ఎస్‌ను బీజేపీ తుక్కుతుక్కుగా ఓడించింది. పార్లమెంట్ ఎన్నికలు బీజేపీ శ్రేణుల్లో జోష్‌ను నింపగా కాంగ్రెస్, బీఆర్ఎల్‌లో కేడర్‌ను తీవ్ర నిరాశపరిచాయి. ముఖ్యంగా ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ భవిష్యత్తు ఆశలు అడియాసలయ్యాయి. దశాబ్దకాలం కిందట జరిగిన సాధారణ ఎన్నికల అనంతరం తెలుగు దేశం పార్టీ ఎలా పతనమైందో అచ్చం అలానే ఇపుడు బీఆర్ఎస్ పరిస్థితి అలానే మారింది. ఒకప్పుడు ఉమ్మడి జిల్లాను కంచు కోటగా మలుచుకున్న టీడీపీ 2014 ఎన్నికల తరువాత కోలుకోని విధంగా దెబ్బతిన్న విషయం తెలిసిందే. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో టీడీపీకి 8 అసెంబ్లీ స్థానాలు లభించాయి. తరువాత ఆ పార్టీ క్రమేపీ బలహీనపడి కోలుకోలేదు. ఇపుడు టీఆర్ఎస్ పరిస్థితి కూడా అలానే కనిపిస్తోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ 10 అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకుంది. అయితే అధికారం కోల్పోవడంతో బీఆర్ఎస్ రోజు రోజుకు బలహీనపడుతోంది. తాజాగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో బీఆర్ఎస్ తేలిపోయింది. కనీవిని ఎరుగని రీతిలో ఆరు నెలల కాలంలోనే బీఆర్ఎస్ గణనీయంగా ఓటు బ్యాంకు కోల్పోయింది. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆయన తనయుడు, మాజీ మంత్రి కేటీఆర్ విస్తృతంగా ప్రచారం చేసినా ఒక్క సీటూ దక్కించుకోలేకపోయారు. కనీసం రెండో స్థానం కూడా బీఆర్ఎస్‌కు దక్కలేదు. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఈ రెండు పార్లమెంట్ స్థానాల పరిధిలో బీఆర్ఎస్ 11.66లక్షల ఓట్లు కోల్పోవడం గమనార్హం. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి బీఆర్ఎస్ కంటే కేవలం 4.8లక్షల ఓట్లు అధికంగా వచ్చాయి. ఈ 4.8లక్షల ఓట్లే రాష్ట్రంలో అధికారం తారుమారు కావడానికి కారణమయ్యాయి. అలాంటిది ఉమ్మడి జిల్లాలోనే ఇపుడు బీఆర్ఎస్ ఆరు నెలల కాలంలో దీనికి రెట్టింపు కంటే అధికంగా ఓట్లు కోల్పోవడం చూస్తే భవిష్యత్తులో బీఆర్ఎస్ కోలుకునే అవకాశాలు అంతంత మాత్రమేనని చెప్పాలి. అధిక సంఖ్యలో ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ బీఆర్ఎస్ పార్టీ ఈ రెండు పార్లమెంట్ స్థానాల పరిధిలో మూడో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. బీఆర్ఎస్ అధికారం కోల్పోయాక పరిస్థితి రోజు రోజుకు దిగజారుతుండడంతో ఆ పార్టీకి సంబంధించిన మెజారిటీ ఓటర్లు బీజేపీ వైపు మొగ్గు చూపారు. దీంతో బీజేపీకి ఈ ఎన్నికల్లో గణనీయంగా ఓట్లు లభించాయి.

ఎమ్మెల్యేలు ఉంటారా?

తాజాగా మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎక్కువ కాలం ఆ పార్టీలో కొనసాగే అవకాశాలు కనిపించడం లేదు. బీజేపీ ఓటు బ్యాంకు గణనీయంగా పెరగడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఇక తన వైపు తిప్పుకోవాలని కాంగ్రెస్ భావిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు ఇప్పటికే కొందరు ఎమ్మెల్యేలతో సంప్రదింపులు కూడా చేపట్టారు. గతంలో టీడీపీ ఎమ్మెల్యేలంతా బీఆర్ఎస్‌లో మూకుమ్మడిగా చేరిన విధంగానే ఇపుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా మూకుమ్మడిగా చేరనున్నట్లు ప్రచారం సాగుతోంది. మునిగి పోయే నావలో ఇక ఎక్కువ కాలం ఉండలేమని కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సన్నిహితుల వద్ద ప్రస్తావిస్తున్నారు. ఇదే జరిగితే బీఆర్ఎస్ మరింత పతనమయ్యే అవకాశం ఉంది.

ఇంతలో ఎంత తేడా!

గత అసెంబ్లీ ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో బీఆర్ఎస్‌కు 40.85శాతం ఓట్లు రాగా కాంగ్రెస్ పార్టీకి 35.2శాతం, బీజేపీకి 19.37 శాతం ఓట్లు వచ్చాయి. తాజాగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 10.80శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. కాంగ్రెస్‌కు 38.44శాతం ఓట్లు రాగా బీజేపీకి అనూహ్యంగా 48.77శాతం ఓట్లు వచ్చాయి. ఈ నియోజకవర్గంలో గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే దాదాపు 30శాతం ఓట్లు బీఆర్ఎస్ కోల్పోయింది. అలాగే గత అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల పరిధిలో బీఆర్ఎస్‌కు 47శాతం ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 30.05శాతం, బీజేపీకి 20.56శాతం ఓట్లు లభించాయి. ఈ పార్లమెంట్ ఎన్నికలో పరిస్థితి పూర్తిగా తారుమారైంది. ఒక్క ఎమ్మెల్యే కూడా లేకున్నా బీజేపీ రికార్డు స్థాయిలో ఓట్లు కొల్లగొట్టింది. మల్కాజిగిరి పార్లమెంట్‌లో బీజేపీకి 51.64శాతం ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 31.24శాతం, బీఆర్ఎస్‌కు 15.65శాతం ఓట్లు లభించాయి. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా మల్కాజిగిరి పార్లమెంట్ చరిత్రలో బీజేపీకి 3.91లక్షల పైచిలుకు ఓట్ల మెజార్టీ లభించింది. ఇక్కడ కూడా బీఆర్ఎస్ ఆరు నెలల కాలంలోనే దాదాపు 31శాతానికి పైగా ఓట్లు కోల్పోయింది.

కమల వికాసంతో కాంగ్రెస్‌కు ముచ్చెమటలు

తాజా పరిణామాలతో అధికార కాంగ్రెస్‌కు ముచ్చెమటలు పడుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల నాటికి ఉమ్మడి జిల్లాపై పూర్తిస్థాయి పట్టు సాధించేందుకు ప్రయత్నిస్తున్న కాంగ్రెస్ పార్టీకి బీజేపీ కొరకరాని కొయ్యగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి దాదాపు 10.46 లక్షల ఓట్లు అధికంగా వచ్చాయి. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ కంటే 5.65లక్షల ఓట్లు అధికంగా రావడం గమనార్హం. దీంతో బీజేపీ ఉమ్మడి జిల్లా అంతటా దండిగా ఓటు బ్యాంకు సంపాదించిచి అధికార పార్టీకి సవాల్‌గా మారింది. కాంగ్రెస్‌లోకి మాజీ మంత్రితో పాటు ఎంపీ, ముగ్గురు జడ్పీ చైర్మన్లు, కార్పొరేషన్ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లతో పాటు అనేక మంది బీఆర్ఎస్ నుంచి వచ్చినా ఎన్నికల్లో వారి ప్రభావం పెద్దగా కనిపించలేదు. దీంతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అధికార కాంగ్రెస్‌కు పెద్ద తలనొప్పిగా మారే అవకాశం ఉందన్న చర్చ సర్వత్రా సాగుతోంది.

ఆరు నెలల్లోనే.. ఎందుకిలా?

అధికార పార్టీ శ్రేణుల్లో కొనసాగుతున్న చర్చ



ఆంధ్రజ్యోతి, వికారాబాద్/తాండూరు జూన్ 5: అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన ఆరు నెలల్లోనే జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఫలితాలు రావడం ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన ఓట్లతో లోక్‌సభ ఎన్నికల్లో సాధించిన ఓట్లను బేరీజు వేసుకుంటే ఈ విషయం స్పష్టమవుతోంది. అసెంబ్లీ ఎన్నికలు జరిగిన ఆరు నెలల్లోనే ప్రజలిచ్చిన తీర్పు పట్ల అధికార శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్, వికారాబాద్, పరిగి, తాండూరు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంతో పాటు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ నియోజకవర్గం వికారాబాద్‌లో మాత్రమే కాంగ్రెస్ సత్తా చాటింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన మెజార్టీ కంటే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కొంత తగ్గితే, పరిగి, తాండూరు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ కంటే బీజేపీ ఆధిక్యత సాధించడం చర్చనీయాంశంగా మారింది. కొడంగల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా రేవంత్‌రెడ్డి 32,532 ఓట్ల మెజార్టీతో విజయం సాధించగా, ఈ ఎన్నికల్లో కొడంగల్ నియోజకవర్గం నుంచి 21,854 ఓట్ల మెజార్టీ వచ్చింది. ప్రతి రౌండ్‌లోనూ కాంగ్రెస్ ఆధిక్యత కనబరిచినా.. గత అసెంబ్లీ ఎన్నికల కంటే మెజార్టీ మాత్రం తగ్గింది. పరిగి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డికి 23,956 ఓట్ల మెజార్టీ రాగా, ఈ ఎన్నికల్లో బీజేపీ 2,003 ఓట్ల ఆధిక్యత సాధించింది. వికారాబాద్ నియోజకవర్గం నుంచి గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 12,672ఓట్ల మెజార్టీ రాగా, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 7,649 ఓట్ల ఆధిక్యత వచ్చింది. తాండూరు నుంచి కాంగ్రెస్ అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో 6,583 మెజారిటీ రాగా, ఈ ఎన్నికల్లో ఇక్కడ బీజేపీకి 7,691 ఓట్ల ఆధిక్యత లభించడం గమనార్హం. అసెంబ్లీ ఎన్నికలకు, లోక్‌సభ ఎన్నికలకు పోలిస్తే ప్రజలు కాంగ్రెస్ కంటే బీజేపీ పట్ల ఎక్కువగా మొగ్గు చూపారనేది చర్చనీయాంశంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ సాధించిన ఆధిక్యతను ఐదు నెలల కాలంలో కోల్పోవాల్సి రావడంపై అధికార పార్టీ వర్గాల్లో తర్జనభర్జన జరుగుతోంది. ఇందుకు కారణాలు ఏమై ఉంటాయనే చర్చ జరుగుతోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ బలంగా ఉన్న తాండూరు, పరిగి నియోజకవర్గాల్లో బీజేపీ ఆధిక్యత చూపడం విశేషం. లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కడెక్కడ తమకు ఎక్కువ, ఎక్కడెక్కడ తక్కువ ఓట్లు వచ్చాయి, ఇందుకు గల కారణాలను పార్టీ నాయకులు ఆరా తీస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల ప్రభావం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలపై ఏ మేరకు ఉంటుందనే ఆందోళన అధికార పార్టీ నేతల్లో వ్యక్తమవుతోంది.





- అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే లోక్‌సభ ఎన్నికల్లో గణనీయంగా తగ్గిన ఓట్లు
- రెండో స్థానం నుంచి మూడో స్థానానికి దిగజారిన బీఆర్ఎస్
- ఉత్సాహంలో బీజేపీ.. నైరాశ్యంలో గులాబీ శ్రేణులు
- భవిష్యత్తుపై వ్యక్తమవుతున్న ఆందోళన

ఓట్ల బదలాయింపు!

బీఆర్ఎస్ నుంచి బీజేపీకి భారీగా క్రాస్ ఓటింగ్

ఆంధ్రజ్యోతి, వికారాబాద్/పరిగి, జూన్ 5: ఆరు నెలల కిందట జరిగిన అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గణనీయంగా ఓట్లు తగ్గాయి. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో నువ్వా..నేనా.. అన్నచందంగా హోరీహోరీగా పోరాడి రెండో స్థానంలో నిలిచిన బీఆర్ఎస్ లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం మూడో స్థానానికి పరిమితం కావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. 2023, నవంబర్ నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో బీఆర్ఎస్ పార్టీకి 3,01,491 ఓట్లు రాగా, బీజేపీకి 31,860 ఓట్లు, కాంగ్రెస్ పార్టీకి 3,77,512 ఓట్లు వచ్చాయి. పరిగి నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు 74,523 ఓట్లు, కాంగ్రెస్‌కు 98,536 ఓట్లు, బీజేపీకి 16,653 ఓట్లు వచ్చాయి. వికారాబాద్ నియోజకవర్గంలో మొత్తం ఓట్లు బీఆర్ఎస్‌కు 73,992 ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు 86,885 ఓట్లు, బీజేపీకి 7,132 ఓట్లు పోలయ్యాయి. తాండూరు నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు 78,079 ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు 84,662 ఓట్లు, బీజేపీకి 4,087 ఓట్లు వచ్చాయి. అదే కొడంగల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు 74,897 ఓట్లు, కాంగ్రెస్‌కు 1,07,429 ఓట్లు, బీజేపీకి 3,988 ఓట్లు వచ్చాయి. అదే లోక్‌సభ ఎన్నికల్లో జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి 2,98,240 ఓట్లు రాగా, బీజేపీకి 2,81,280 ఓట్లు, బీఆర్ఎస్‌కు 63,572 ఓట్లు వచ్చాయి. పరిగి నియోజకవర్గంలో బీజేపీకి 74,024 ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు 68,868 ఓట్లు, బీఆర్ఎస్‌కు 23,142 ఓట్లు వచ్చాయి. వికారాబాద్ నియోజకవర్గంలో బీజేపీకి 67,435 ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు 75,084 ఓట్లు, బీఆర్ఎస్‌కు 13,877 ఓట్లు వచ్చాయి. తాండూరు నియోజకవర్గంలో బీజేపీకి 77,261 ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు 69,874 ఓట్లు, బీఆర్ఎస్‌కు 10,595 ఓట్లు వచ్చాయి. కొడంగల్ నియోజకవర్గంలో బీజేపీకి 62,560 ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు 84,414 ఓట్లు, బీఆర్ఎస్‌కు 15,958 ఓట్లు వచ్చాయి. లోక్‌సభ ఎన్నికల్లో జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొడంగల్, వికారాబాద్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఆధిక్యత నిలుపుకోగా, పరిగి, తాండూరు నియోజకవర్గాల్లో బీజేపీ తన సత్తా చాటుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో పరిగి మినహా మిగతా మూడు నియోజకవర్గాల్లో డిపాజిట్ కోల్పోయిన బీజేపీ.. లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం అనూహ్యంగా అధిగమించి కాంగ్రెస్‌పై ఆధిక్యత సాధించింది.

బీఆర్ఎస్‌కు వచ్చిన ఓట్ల వివరాలు

నియోజకవర్గం	2023 అసెంబ్లీ	2024 లోక్‌సభ	తగ్గిన ఓట్లు
పరిగి	74,523	23,142	51,381
వికారాబాద్ (ఎస్సీ)	73,992	13,877	60,115
తాండూరు	78,079	10,595	67,484
కొడంగల్	74,897	15,958	58,939

భవిష్యత్తుపై గుబులు

లోక్‌సభ ఎన్నికల్లో గణనీయంగా ఓటు బ్యాంకు కోల్పోయిన బీఆర్ఎస్ భవిష్యత్తు ఎలా ఉంటుందనే చర్చ కొనసాగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఢీ అంటే ఢీ అన్న విధంగా పోటీ ఇచ్చిన బీఆర్ఎస్.. లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం ఆశించిన స్థాయిలో సత్తా చాటుకోలేకపోయింది. ఎన్నికల ప్రచారం ప్రారంభంలో. ధీటుగా పోటీ ఇస్తుందని భావించిన బీఆర్ఎస్ పోలింగ్‌కు వారం, పది రోజులు ముందుగానే అస్త్ర సన్యాసం చేసిందనే విమర్శలు వ్యక్తమయ్యాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఎన్నికల్లో మాత్రం బీఆర్ఎస్ శ్రేణులు ఇష్టం ఉండీ, లేనట్లుగా పనిచేశాయనే ఆరోపణలు వచ్చాయి. లోక్‌సభ ఎన్నికల్లో తగ్గిన ఓటు బ్యాంకును స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరిగి రాబట్టుకుని సత్తా చాటే విధంగా అధికార కాంగ్రెస్ పార్టీ పనిచేయనుండగా, లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటుకున్న బీజేపీ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ తమ సత్తా చాటుకునే ప్రయత్నం చేయనుంది. లోక్‌సభ ఎన్నికల్లో మూడో స్థానానికి పరిమితమైన బీఆర్ఎస్ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార కాంగ్రెస్, బీజేపీలకు ఏ విధంగా పోటీ ఇస్తుందనే చర్చ సాగుతోంది. లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థికి గణనీయంగా ఓటు బ్యాంకు తగ్గడంతో బీఆర్ఎస్ శ్రేణులు నైరాశ్యంలో మునిగాయి.

స్ట్రాంగ్ రూమ్‌కి

వీవీ ప్యాట్‌లు

వికారాబాద్, జూన్ 5 : పార్లమెంట్ ఎన్నికల అనంతరం జిల్లాలో నాలుగు నియోజకవర్గాలకు సంబంధించి వీవీ ప్యాట్‌లను స్థానిక తహసీల్దారు కార్యాలయం స్ట్రాంగ్ రూమ్‌కి తరలించడం జరిగిందని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఎస్పీ కోటిరెడ్డి తో కలిసి ఈవీఎంలను భద్రపర్చిన ఏఎంసీ గోడౌన్, తహసీల్దార్ కార్యాలయ స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ పూర్తి అయిన సందర్భంగా వికారాబాద్, కొడంగల్, పరిగి, తాండూరు నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల నిర్వహణకు ఉపయోగించిన ఈవీఎంలు, కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లను ఏఎంసీ గోడౌన్ నందు భద్రపర్చడం జరిగిందన్నారు. సంబంధిత రిజిస్ట్రర్‌లలో సంతకాలు చేశారు. నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో సుధీర్, ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



వీవీ ప్యాట్‌లు భద్రపరుస్తున్న కలెక్టర్



కోర్టు ఆవరణలో మొక్క నాటుతున్న శ్రీనివాస్‌రెడ్డి

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి

- జిల్లా జడ్జి సున్నం శ్రీనివాస్‌రెడ్డి

వికారాబాద్, జూన్ 5 : ప్రతీ ఒక్కరు పర్యావరణ పరిరక్షణ కోసం పాటు పడుతూ మొక్కలు నాటాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి సున్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిశోర్ సీనియర్ సివిల్ జడ్జి డీబీ శీతల్, జూనియర్ ప్రిన్సిపల్ జడ్జి శ్రీకాంత్, అదనపు జడ్జి శ్రుతి దూతా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్‌కుమార్, ఉపాధ్యక్షుడు సయ్యద్ ఖయ్యూమ్, న్యాయవాదుల టి.వెంకటేష్, మహిపాల్‌రెడ్డి, గోపాల్, పి.ఆనంద్, పీపీ అన్వేష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కురిసిన తొలకరి... మురిసిన రైతు

- వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం
- సాగుకు సన్నద్ధమవుతున్న అన్నదాతలు

ఆంధ్రజ్యోతి, మేడ్చల్/ఘట్‌కేసర్/ వికారాబాద్/పూడూరు/కొడంగల్ రూరల్, జూన్ 5 : తొలకరి పలకరించడంతో రైతన్నలు మురిసిపోతున్నారు. బుధవారం మేఘవృతమైన వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. వికారాబాద్ జిల్లాలో పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. సుమారు గంట పాటు కురిసిన వర్షంతో వానాకాలం సాగుకు రైతలు సన్నద్ధం అవుతున్నారు. దుక్కులు దున్నుకొని విత్తనాలు విత్తేందుకు సిద్ధమయ్యారు. పూడూరు మండలంతో పాటు మేడిపల్లి కలాన్, చన్‌గోముల్, కడుమూరు తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. కురిసిన వర్షంతో రైతన్నలు సంతోషం వ్యక్తం చేశారు. ఘట్‌కేసర్‌లో భారీ వర్షం కురిసింది. 40 నిముషాల పాటు కురిసిన వానతో రోడ్లపై వరద ప్రవహించింది. రోహిణి కార్తె వచ్చినందున ఆరుతడి పంటల సాగుకు దుక్కులు దున్నుకునే అవకాశం ఏర్పడిందని అన్నదాతలు సంతోషం వ్యక్తం చేశారు.



ఘట్‌కేసర్‌లో కురుస్తున్న వర్షం

ఎరువులు, విత్తనాల కొనుగోలులో రైతుల బిజీబిజీ

ముందస్తుగా రుతుపవనాలు రాష్ట్రంలో ప్రవేశించడంతో రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసేందుకు కొడంగల్ మండల కేంద్రంలోని ఫర్టిలైజర్స్ దుకాణాల దగ్గర బారులు తీరారు. కంది, పెసర విత్తనాలను వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

షాద్‌నగర్ అసెంబ్లీ సెగ్మెంటులో
బీజేపీకి పెరిగిన ఓటు బ్యాంకు

- ఓట్లు తగ్గినా మెజారిటీ పెంచుకున్న కాంగ్రెస్
- చతికిలపడ్డ భారత రాష్ట్ర సమితి

షాద్‌నగర్ అర్బన్, జూన్ 5: మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని షాద్‌నగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో అనూహ్యంగా భారతీయ జనతా పార్టీకి భారీగా ఓటు బ్యాంకు పెరిగింది. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే బీజేపీకి ఎనిమిదింతలు ఓట్లు పెరిగాయి. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అందె బాబయ్యకు 8,078 ఓట్లు రాగా.. పార్లమెంట్ స్థానానికి పోటీ చేసిన డీకే అరుణకు 68,096 ఓట్లకు పెరిగాయి. దాంతో లోక్‌సభ ఎన్నికల్లో 60,018 ఓట్లు పెరిగాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ టికెట్ ఇవ్వకపోవడంతో రెబల్ అభ్యర్థిగా ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి టికెట్ తెచ్చుకుని పోటీ చేసి 31,426 ఓట్లు తెచ్చుకున్న పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి.. తిరిగి బీజేపీలో చేరడం, ప్రధాని మోదీ గాలి వీయడంతో బీజేపీకి ఓటు శాతం భారీగా పెరిగింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించిన వీర్లపల్లి శంకర్ 76,947 ఓట్లు పొంది, 7,128 ఓట్ల మెజార్టీని సాధించారు. లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన చల్లా వంశీచంద్‌రెడ్డికి 76,000 ఓట్లు వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల కంటే 947 ఓట్లు తగ్గినా 7,904 ఓట్లకు మెజారిటీ పెరిగింది. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి రెండవ స్థానంలో నిలిచిన బీఆర్ఎస్ అభ్యర్థి వై.అంజయ్యయాదవ్‌కు 70,385 ఓట్లు వచ్చాయి. అదే లోక్‌సభ స్థానానికి బీఆర్ఎస్ అభ్యర్థిగా తిరిగి పోటీ చేసిన మన్నె శ్రీనివాస్‌రెడ్డికి 31,560 ఓట్లు మాత్రమే వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల ఓట్ల కంటే లోక్‌సభకు 38,825 ఓట్లు తగ్గాయి. అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే కాంగ్రెస్ తన ఆధిపత్యాన్ని నిలుపుకోగా, బీజేపీ బలాన్ని పెంచుకుంది. బీఆర్ఎస్ మాత్రం సగానికి సగం ఓట్లను తగ్గించుకుని మూడోస్థానానికి పరిమితమైంది.

'పట్నం' అసెంబ్లీ సెగ్మెంటులో
ఘోరంగా దెబ్బతిన్న బీఆర్ఎస్

- అనూహ్యంగా పుంజుకున్న బీజేపీ.. మున్ముందు మారనున్న సమీకరణాలు
- ఎంపీ ఎన్నికల ఫలితాలపై నాయకుల విశ్లేషణ

ఇబ్రహీంపట్నం, జూన్ 5: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడడంతో ప్రధాన రాజకీయ పార్టీలు తమకు వచ్చిన ఓట్లపై విశ్లేషణ చేసుకుంటున్నాయి. భువనగిరి పార్లమెంటరీ స్థానం ఇబ్రహీంపట్నం అసెంబ్లీ సెగ్మెంటులో గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో పోల్చితే ఈసారి బీఆర్ఎస్ పార్టీ ఘోరంగా దెబ్బతింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మొదటి స్థానంలో నిలవగా బీఆర్ఎస్‌ది రెండో స్థానం, బీజేపీ మూడో స్థానంతో సరిపెట్టుకుంది. రెండు ఎన్నికల్లోనూ సీపీఎం పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ తగ్గినప్పటికీ మొదటి స్థానంలో నిలువగా బీజేపీ రెండో స్థానంలోకి వచ్చింది. ఇక్కడ బీఆర్ఎస్ మూడో స్థానానికి పడిపోయింది. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డికి 1,24,447 పోలవగా బీఆర్ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి 84,320 ఓట్లు వచ్చాయి. అలాగే బీజేపీ అభ్యర్థి నోముల దయానంద్‌గౌడ్‌కు 15,790 ఓట్లు పోలవగా సీపీఎం అభ్యర్థి పగడాల యాదయ్యకు 4,019 ఓట్లు వచ్చాయి. అప్పట్లో బీఆర్ఎఎస్ రెండో స్థానంలో నిలవగా కాంగ్రెస్, బీజేపీల మధ్య ఓట్ల తేడా 40,027గా ఉంది. కాగా, లోక్‌సభ ఎన్నికల విషయానికి వస్తే.. ఇదే అసెంబ్లీ సెగ్మెంటులో కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి 88,013 ఓట్లు పోలవగా బీజేపీ అభ్యర్థి డా.బూర నర్సయ్యగౌడ్‌కు 84,044 ఓట్లు వచ్చాయి, బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్‌కు 39,541 ఓట్లు మాత్రమే వచ్చాయి. సీపీఎం అభ్యర్థి మహ్మద్ జహంగీర్‌కు 5,684 ఓట్లు పడ్డాయి. గత అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే బీఆర్ఎస్ ఓటింగ్ సగానికిపైగా పడిపోయింది. బీజేపీ ఓటింగ్ ఒక్కసారిగా పెరిగింది. దీనిని బట్టి బీఆర్ఎస్ ఓట్లు బీజేపీకి క్రాస్ అయ్యాయని స్పష్టంగా తెలుస్తోంది. నిజానికి క్యామ మల్లేష్‌కు ఇబ్రహీంపట్నం సొంత నియోజకవర్గం కావడంతో.. ఇక్కడ ఓట్లపై ఆయన ఎక్కువ ఆశలు పెట్టుకున్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీల మధ్య ఓట్ల తేడా కేవలం 3,969 మాత్రమే.

మారనున్న రాజకీయ సమీకరణాలు

గతేడాది నవంబరు చివరన జరిగిన ఎన్నికలు, ఈ లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన పార్టీలకు వచ్చిన ఓట్లపై ఆయా రాజకీయ పార్టీలు విశ్లేషించుకుంటున్నాయి. బీజేపీ అనూహ్యంగా పుంజుకోవడంతో మున్ముందు పరిస్థితులు ఏంటనేది వేచిచూడాల్సిందే. ఆయా పార్టీలో సమీకరణాలు వేగంగా మారనున్నాయని సమాచారం. ఇది వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి ఎలాంటి ప్రభావం చూపనుందనేది కూడా జోరుగా చర్చ కొనసాగుతోంది.

కార్పొరేట్ విద్యా సంస్థల్లో

అధిక ఫీజులను నియంత్రించాలి

శంషాబాద్ రూరల్, జూన్ 5 : కార్పొరేట్ విద్యా సంస్థల్లో అధిక ఫీజులను నియంత్రించాలని టీఎస్ఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ బుధవారం డీఈవో సుశీందర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలోని జూకల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన డీఈవోకు ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనివాస్ మాట్లాడుతూ నేడు రాష్ట్రంలో కార్పొరేట్ విద్యా సంస్థలకు చెందిన




డీఈవోకు వినతిపత్రం అందిస్తున్న లక్ష్మీనివాస్

పాఠశాలలు, కళాశాలల్లో లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, పలు ప్రాంతాల్లో ఫిట్‌నెస్ లేని బస్సులు రోడ్లపై తిరుగుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయని అన్నారు. ప్రయివేట్ పాఠశాల్లో పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాంలు అధిక ధరలకు అమ్ముతున్నారని విన్నవించారు. సానుకూలంగా స్పందించిన డీఈవో తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. త్వరలోనే ఎంఈవోతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. టీఎస్ఎస్‌వో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వంశీ, సచిన్, భానుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

హమ్మయ్య.. ఊపిరి పీల్చుకున్న

యంత్రాంగం

సజావుగా ఎన్నికల ప్రక్రియను ముగించిన అధికారులు



మేడ్చల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలు ముగిసి కాస్త ఊపిరి పీల్చుకునే లోపే పార్లమెంటు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై చివరకు కౌంటింగ్ కూడా సజావుగా పూర్తి కావడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. నామినేషన్‌ల స్వీకరణ మొదలుకొని పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఉద్యోగులు భాగస్వాములై విజయవంతం చేశారు. రిటర్నింట్ అధికారిగా వ్యవహరించిన కలెక్టర్ గౌతమ్ నియోజకవర్గాల ఏఆర్‌ఓలతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లారు. ఉపాధ్యాయులు, రెవెన్యూ, పోలీసు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది ఈ ప్రక్రియలో పాలుపంచుకున్నారు. మల్కాజిగిరి పార్లమెంటు స్థానానికి 22మంది అభ్యర్థులు పోటీ చేశారు. నామినేషన్ల ప్రక్రియ నుంచి ఉన్నతాధికారి మొదలు సిబ్బంది వరకు కష్టపడి పని చేశారు. రిటర్నింగ్ అధికారి, సహాయ రిటర్నింగ్ అధికారులు, సెక్టోరియల్, ప్రిసైడింగ్ అధికారులు, సూక్ష్మపరిశీలకు, బీఎల్‌ఓలు ఎన్నికల నిర్వహణలో ప్రధాన భూమిక పోషించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా నిఘా బృందాలు నిరంతరం పనిచేశాయి. ఓట్ల లెక్కింపులోనూ అధికారులు సమన్వయంతో పనిచేశారు. ఉదయం 5గంటలకే పోలింగ్ సిబ్బంది కీసరలోని హోళీమేరీ ఇంజనీరింగ్ కాలేజీకి చేరుకున్నారు. మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టి నియోజకవర్గాల వారీగా ఉద్యోగులను కేటాయించారు. ఉదయం 8గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో లెక్కింపు ప్రక్రియ ప్రారంభించారు. రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ గౌతమ్ నిరంతరం పర్యవేక్షించారు. సహాయ రిటర్నింగ్ అధికారులు సిబ్బందితో లెక్కింపు ఆలస్యం కాకుండా చూశారు. పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకున్నారు. అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్వో హరిప్రియ, ఎన్నికల విభాగం అధికారి రాజేశ్వర్‌రెడ్డి తమవంతు బాధ్యతలు నిర్వహించారు. సిబ్బందికి ఎప్పటికప్పుడు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ నుంచి ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలకు తరలించే వరకు ప్రణాళికాబద్ధంగా పనిచేసి ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- స్థానిక సంస్థలకు అండగా ఉంటా
- ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌రెడ్డి



షాద్‌నగర్ అర్బన్, జూన్ 5: స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు అండగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరాటం చేస్తానని మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌రెడ్డి తెలిపారు. ఆయన స్వగ్రామమైన నందిగామ మండలం మొదళ్లగూడలో బుధవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నవీన్‌రెడ్డిని ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ వార్డు సభ్యుడిగా, ఉప సర్పంచ్‌గా, జడ్పీటీసీ, జడ్పీ వైస్ చైర్మన్‌గా పని చేసిన తనకు స్థానిక సంస్థల సమస్యలు బాగా తెలుసునని అన్నారు. అధికార పార్టీ బలాన్ని తట్టుకుని గెలవడానికి కేసీఆర్ ఆశీర్వాదం, కేటీఆర్‌తో పాటు ఇద్దరు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, 12 మంది మాజీ ఎమ్మెల్యేల సహకారం లభించిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. కేసీఆర్ తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానన్నారు. రాజకీయాలు ఎన్నికలకే పరిమితం చేయాలని, గెలిచిన తరువాత ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలే తప్ప.. ప్రతిపక్ష నాయకులే టార్గెట్‌గా కక్షసాధింపు, కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని కోరారు.



పార్టీలో చేరినవారికి కండువాలు కప్పుతున్న బక్కని నర్సింహులు

ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

మొయినాబాద్ రూరల్, జూన్ 5: దివంగత నందమూరి తారక రామారావు(ఎన్టీఆర్) ఆశయ సాధనకు కృషి చేయాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు అన్నారు. బుధవారం మొయినాబాద్ మండల కేంద్రంలో అజీజ్‌నగర్ గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు బక్కని ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలుగుజాతి అభివృద్ధి, సంక్షేమానికి పరితపించేది కేవలం టీడీపీ మాత్రమేనని, పార్టీలోకి చేరికలు కొనసాగడం సంతోషకరమని అన్నారు. నాయకులు పద్మారావు, మాణిక్యం, ఎల్లని యాదయ్య, సుభాన్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, రాజు గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీన్‌కుమార్, గోపాల్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాల్‌లో ముమ్మరంగా వాహనాల తనిఖీ

యాచారం, జూన్ 5 : అక్రమంగా పాడిపశువుల రవాణా, విత్తనాల క్రయ విక్రయాలను నివారించడం కోసం కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు చెప్పారు. బుధవారం మాల్‌లో ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. పాడిపశువులను అక్రమంగా రవాణా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాలుగు రోజుల్లో 30 పాడిపశువులను పట్టుకొని గోశాలకు తరలించామని చెప్పారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాల తనిఖీకి వాహనదారులు సహకరించాలని కోరారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

యాచారం, జూన్ 5: దీర్ఘకాలికంగా కేంద్రీయ మెట్టవ్యవసాయ పరిశోధనా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులను రెగ్యులరైజ్ చేసి ఆదుకోవాలని జిల్లా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సిరెడ్డి, పి.బ్రహ్మయ్యలు డిమాండ్ చేశారు. కనీస వేతనం నెలకు రూ.26వేలు అందించాలని డిమాండ్ చేశారు. కూలీలకు యూనిఫాం, గుర్తింపుకార్డులు ఇవ్వాలని కోరారు. కనీసం 8.33శాతం బోనస్ ప్రతీయేటా చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనా కేంద్రం గున్‌గల్ ఇన్‌చార్జి కార్మికులను బెదిరించడం దారుణమన్నారు. ఈమేరకు కేంద్రీయ మెట్టవ్యవసాయ పరిశోధనా కేంద్రం వద్ద ధర్నా చేశారు. నాయకులు లక్ష్మమ్మ, యాదమ్మ, గణేష్, పెద్దయ్య, శ్రీకాంత్, కృష్ణ, శివుడు, బాలకృష్ణ, రాములు, చందూనాయక్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కార్మికులు సీఐటీయూ కార్యకర్తలు

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలి



తాండూరు: మొక్కలు నాటుతున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కొట్రిక విజయలక్ష్మి

తాండూరు, జూన్ 5 : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఖాంజాపూర్‌గేటు సమీపంలో వేంకటేశ్వరాలయం ప్రాంగణంలో, మైనార్టీ బాలికల పాఠశాలలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కొట్రిక విజయలక్ష్మి మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరి రక్షణ అందరి బాధ్యత అని, ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి వాటిని వృక్షాలుగా తీర్చిదిద్దేలా కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో తాండూరు డివిజనల్ ఫారెస్ట్ అధికారి శ్యాంసుందర్‌రావు, ప్రోగ్రామ్ కన్వీనర్ వెంకట్, శ్రీ రామకృష్ణ సేవా సమితి గౌరవాధ్యక్షుడు బస్వరాజ్, రిటైర్డ్ హెచ్‌ఎం బిచ్చప్ప, మైనార్టీ గురుకుల ఉపాధ్యాయ బృందం ఫాతిమా, పుష్పలత, పద్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.



దోమ: కేసులమ్మ తండా పాఠశాలలో మొక్కలు నాటిన ఎంపీడీవో మహేశ్‌బాబు

దోమ: ఎంపీడీవో మహేశ్‌బాబు, బొంపల్లి కాంప్లెక్స్ హెచ్‌ఎం వెంకట్ కేసులమ్మ తండా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతీ ఒక్కరు పర్యావరణాన్ని పరిరక్షిస్తూ భవిష్యత్ తరాలకు అందించాలని కోరారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సంధ్యారాణి, వెంకటయ్య, సీఆర్‌పీ వెంకటేశ్, నసీర్, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

మూడుచింతలపల్లి: మండల వ్యాప్తంగా పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు గ్రామాల్లోని ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటారు. ఎంపీడీవో వత్సలాదేవి మాట్లాడుతూ మొక్కలతోనే జీవుల మనుగడ అన్నారు. ఇళ్ల వద్ద మొక్కలు నాటి పెంచాలన్నారు. కార్యక్రమాల్లో వైస్‌ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు పంచాయితీ కార్యదర్శులు, సిబ్బంది, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మూడుచింతలపల్లి: మొక్కలు నాటుతున్న ఎంపీడీవో వత్సలాదేవి, సిబ్బంది



ఘట్‌కేసర్‌లో మొక్క నాటి నీళ్లు పోస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని

కులకచర్ల: ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. బండవెల్కిచర్లలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. వృక్షాలు ఉంటేనే వర్షాలు సకాలం లో పడి గ్రామాలన్నీ సస్యశ్యామలంగా మారుతాయని తెలిపారు.



పరిగి కోర్టు అవరణలో మొక్కలు నాటుతున్న మున్సిఫ్ కోర్టు న్యాయాధికారి నాగుల శిల్ప

ఘట్‌కేసర్ రూరల్ : పర్యావరణ సమతుల్యాన్ని కాపాడాలని అనురాగ్ యూనివర్సిటీ ఫార్మసీ డీన్ వసుధబక్షి అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ, నీలిమ ఆసుపత్రి సంయుక్తంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించాయి. కాలుష్య నివారణకు మొక్కలు పెంచడమే మార్గమన్నారు. పర్యావరణంపై విద్యార్థులకు పోటీ పరీక్ష నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నీలిమ ఇన్‌స్టిట్యూట్ అఫ్ మెడికల్ సైన్సెస్ డీన్‌లు లక్ష్మీప్రసన్న, సంధ్య, ప్రొఫెసర్ లింగస్వామి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు రాజేంద్రకుమార్, కిరణ్‌కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కులకచర్ల: బండవెల్కిచర్లలో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో రామకృష్ణ

కీసర: పర్యావరణ పరిరక్షణకు విరివిగా మొక్కలు పెంచాలని ఎంపీడీవో గ్యామా అన్నారు. చీర్యాల, రాంపల్లిదాయర, కీసర, యాద్గార్‌పల్లి గ్రామాల్లో మొక్కలు నాటారు. ఎంపీవో నందకిషోర్, పంచాయతీ కార్యదర్శిలు పాల్గొన్నారు.

పరిగి: పర్యావరణ సమతుల్యత మొక్కలపైనే ఆదారపడి ఉందని, మనం మొక్కలు పెంచితే కాలుష్యం తగ్గి ఆరోగ్యకర పర్యావరణం రూపుదిద్దుకుంటుందని పరిగి మున్సిఫ్ కోర్టు న్యాయాధికారి నాగుల శిల్ప అన్నారు. పరిగిలోని కోర్టు అవరణలో మొక్కలు నాటారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ ఉపాధ్యక్షుడు ఇబ్రహీంఖాన్, న్యాయవాదులు గౌస్ పాషా, నర్సింహారావు, శ్రీనివాస్‌రెడ్డి, అలీమొద్దీన్, శివారెడ్డి, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఆర్పీఎఫ్ అధికారులు

ఘట్‌కేసర్: ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపాడాలని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్యయాదవ్ అన్నారు. బాలాజీనగర్‌లో మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ దేశంలో రోజురోజుకూ వన సంపద తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. చెట్లు తరిగి వాతావరణం వేడెక్కి ప్రజలు, పశుపక్ష్యాదులు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. మొక్కల సంరక్షణకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్: పర్యావరణ దినోత్సవం సందర్భంగా వికారాబాద్ ఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఆర్పీఎఫ్ కార్యాలయం, రైల్వే ఆస్పత్రి పరిసరాల్లో మామిడి, పనస, నేరేడు, మునగ, సీతాఫలం పండ్ల మొక్కలు నాటారు. పర్యావరణ హితానికి అందరూ పాటుపడాలని, అందుకు మొక్కలు నాటి వృక్షాలుగా ఎదిగేలా కృషిచేయాలని ప్రయాణికులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రైల్వే డాక్టర్ అనూష, హెల్త్ ఇన్‌స్పెక్టర్ సోమన్ లాల్ పాల్గొన్నారు.



కీసర: యాద్గార్‌పల్లిలో మొక్కలు నాటుతున్న అధికారులు

కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ఎమ్మార్పీఎస్ శుభాకాంక్షలు



విశ్వేశ్వర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తాండూరు రూరల్, జూన్ 5 : చేవెళ్ల లోక్‌సభ స్థానం నుంచి భారీ మెజార్టీతో గెలుపొందిన బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని ఎమ్మార్పీఎస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొడిగంటి మల్లికార్జున్ మాదిగ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని విశ్వేశ్వర్‌రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రెడ్డి వారితో మాట్లాడుతూ బీజేపీ గెలుపు కోసం కృషిచేసిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు, గడపగడపకూ బీజేపీ కోసం ప్రచారం చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులకు, కార్యకర్తలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మార్పీఎస్ ఆశయ సాధనకు తన, అలాగే పార్టీ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి ప్రకాశ్, ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.నర్సింహులు, కొడిగంటి మల్లికార్జున్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపు హర్షణీయం



మాట్లాడుతున్న నాయకుడు ఆశిరెడ్డి

మోమిన్‌పేట్, జూన్ 5: చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అత్యధిక మెజారిటీతో గెలవడం హర్షణీయమని బీజేవైఎం మండల అధ్యక్షుడు ఆశిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముచ్చటగా మూడోసారి దేశానికి నరేంద్రమోదీ ప్రధాని కానుండటం చరిత్రాత్మకం అన్నారు. అదే విధంగా రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో వికారాబాద్ నియోజకవర్గం నుంచి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించుకునేందుకు కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. కార్యకర్తలు అంకితభావంతో పనిచేయడం వల్లే బీజేపీ గెలుపు సాధ్యం అయిందన్నారు.

ఈటల రాజేందర్‌ను కలిసిన నాగారం మునిసిపల్ చైర్మన్ చంద్రారెడ్డి



ఈటల రాజేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, నాయకులు

కీసర రూరల్, జూన్ 5: మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గ ఎంపీగా భారీ మెజార్టీతో విజయం సాధించిన ఈటల రాజేందర్‌ను బుధవారం నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, స్థానిక నాయకులతో కలిసి ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి, శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, మహిళా మోర్చా అధ్యక్షురాలు జ్యోతి, యువజన నాయకుడు రాహుల్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, కిషోర్, రాజు, శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

అదనపు కోర్టుకు సిబ్బందిని నియమించాలి



జిల్లా సెషన్స్ జడ్జికి వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు

తాండూరు, జూన్ 5 : తాండూరు పట్టణానికి కేటాయించిన అదనపు మున్సిఫ్ కోర్టుకు అవరమైన సిబ్బందిని కేటాయించాలని న్యాయవాదులు జిల్లా ప్రిన్సిపల్ డ్రిస్టిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. మంజూరైన అదనపు మున్సిఫ్ కోర్టును వెంటనే ప్రారంభించాలని కోరారు. న్యాయాధికారిని కలిసి వారిలో తాండూరు బార్ అసోసియేషన్ చైర్మన్ పినమోని శ్రీనివాస్, కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, న్యాయవాదులు శ్రీనివాస్‌రెడ్డి, అగ్గనూరు శ్రీనివాస్, యెద్రామి విశ్వనాథ్ తదితరులు ఉన్నారు.

గౌరి హన్మంతు కుటుంబానికి కేపీఆర్ పరామర్శ



నివాళులు అర్పిస్తున్న కరణం పురుషోత్తంరావు

తాండూరు, జూన్ 5 : తాండూరు మున్సిపాలిటీ పరిధి సాయిపూర్‌నకు చెందిన గౌరి హన్మంతు కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు, యాలాల మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తంరావు పరామర్శించారు. హన్మంతు మరణించిన విషయం తెలుసుకుని బుధవారం పురుషోత్తంరావు వారి నివాసానికి వెళ్లి హన్మంతు భౌతికయానికి నివాళులు అర్పించారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ డైరెక్టర్ కృష్ణకుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

విరిసిన కమలం.. వాడిన గులాబీ

- చేజారిన హస్తం
- లోక్‌సభ ఎన్నికల తీరూ తెన్ను



మేడ్చల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి గణనీయమైన ఓట్లు వచ్చాయి. పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్‌కు ముందే ఆ పార్టీ అభ్యర్థిని ప్రకటించడం ఈటల రాజేందర్‌కు కలిసి వచ్చింది. మిగతా పార్టీల కంటే ముందుగానే ఈటల తనదైనశైలిలో ప్రచారాన్ని నిర్వహించి ముందుగానే ప్రజల దృష్టిలో పడ్డారు. పార్టీలకతీతంగా మల్కాజిగిరి ప్రజలు ఆది నుంచీ ఈటలవైపే మొగ్గు చూపారు. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పార్లమెంటు ఎన్నికల నాటికి బీజేపీ ఓట్లు 22శాతం పెరగడం విశేషం. మరోవైపు బీఆర్‌ఎస్ ఓట్లు కూడా బీజేపీకి రావడంతో ఈటల రాజేందర్‌కు భారీ మెజార్టీ దక్కింది. కాంగ్రెస్ పార్టీ నామినేషన్ల సమయంలో అభ్యర్థిని ప్రకటించడం, వికారాబాద్ జిల్లాకు చెందిన సునీతారెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలుపుకొని పోకపోవడం, ప్రచారంలో కూడా వెనుకంజలో ఉండిపోవడంతో హస్తం పార్టీ గెలుపునకు అవసరమైన ఓట్లు సాధించడంలో విఫలమైంది. ఎన్నికల వరకు కూడా ఆ పార్టీ అగ్రనాయకుల్లో సమన్వయం లోపించడం నాయకులు, కార్యకర్తల్లో అసంతృప్తిని మిగిల్చింది. ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా ప్రచారం సాగించడంతో చివరకు సీఎం సిట్టింగ్ స్థానాన్ని ఆ పార్టీ కోల్పోవాల్సి వచ్చింది. ఇక మొన్నటి అసెంబ్లీ ఎన్నికల వరకూ తిరుగేలేని బీఆర్‌ఎస్ పార్టీ ఇక్కడ ఏ మాత్రం పోటీ ఇవ్వలేక చతికిలపడిపోయింది. పార్లమెంటు పరిధి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆ పార్టీ ఎమ్మెల్యేలే ఉన్నా ఎంపీ అభ్యర్థికి డిపాజిట్ రాలేదు. అభ్యర్థిని ప్రకటించే క్రమంలో అయోమయం, పార్టీ ముఖ్య నాయకులు కాంగ్రెస్, బీజేపీల్లో చేరడంతో గులాబీ శ్రేణులు ధైర్యం కోల్పోయాయి. పోటీలో ఉన్నామా? అంటే ఉన్నట్లుగా మాత్రమే పనిచేశారు.

40ఏళ్ల కల నెరవేరింది

- తాండూరు ప్రాంత ప్రజల రుణం తీర్చుకుంటాం
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉప్పరి రమేష్



పెద్దేముల్‌లో విజయోత్సవ సభలో మాట్లాడుతున్న రమేష్

పెద్దేముల్, జూన్ 5 : జిల్లాలో 40ఏళ్ల కల నెరవేరిందని, ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నామని పార్టీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు ఉప్పరి రమేష్ అన్నారు. చేవెళ్ల ఎంపీగా బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజయం సాధించడంతో పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్దేముల్‌లో బుధవారం విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. టపాసులు పేల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్రమోదీ హయాంలో రైతుల కష్టాలు తీరుతాయన్నారు. బీజేపీలో యువతకు మొదటి ప్రాధాన్యం కల్పిస్తామని చెప్పారు. బీజేపీని గెలిపించినందుకు తాండూరు ప్రజల రుణం తీర్చుకుంటామని తెలిపారు. సంస్థల ఎన్నికల్లో సైతం గ్రామ గ్రామాన బీజేపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు హరీష్‌గౌడ్, మాజీ అధ్యక్షులు సందీప్‌కుమార్, ప్రధాన కార్యదర్శులు యాదయ్యగౌడ్, రాంచందర్, శేఖర్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఓటు బ్యాంకు బీజేపీకి బదిలీ

- మూడో స్థానానికి దిగజారిన కారు పార్టీ

ధారూరు, జూన్ 5: పార్లమెంట్ ఎన్నికల్లో మండలంలో బీజేపీకి లీడ్ రావటంతో అధికార కాంగ్రెస్ ఖంగుతింది. మరో వైపు పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ మూడో స్థానానికి పడిపోయింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ధారూరు మండలం కాంగ్రెస్‌కు కంచుకోటగా నిలిచి మెజారిటీ ఇచేంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన ఈ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు మాత్రం కాంగ్రెస్‌కు షాకిచ్చాయి. మండలంలో కాంగ్రెస్‌పై బీజేపీకి 153 ఓట్ల స్వల్ప ఆధిక్యం లభించింది. కొందరు బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీలో చేరడం, బీఆర్‌ఎస్ ఓటు బ్యాంకును బీజేపీకి మళ్లించటంతో మెజారిటీ సాధించిందనే ప్రచారం సాగుతోంది. ఎన్నికలకు రెండు రోజుల ముందు నుంచి బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీకే ఓటు వేయాలని గ్రామాల్లో బహిరంగంగానే ప్రచారం చేశారని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. మండలంలో బీజేపీకి 12,197 ఓట్లు, కాంగ్రెస్‌కు 12,044ఓట్లు రాగా, బీఆర్‌ఎస్‌కు 2,163 ఓట్లే వచ్చాయి. కొందరు కాంగ్రెస్ నాయకులు లోపాయికారిగా బీజేపీ ఓట్లు వేయించారనే ప్రచారం కూడా జరుగుతోంది.ఇలాంటి నాయకులతో పార్టీకి నష్టం అని అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. పార్టీ వ్యవహారాలను గుర్తించి చర్యలు తీసుకోకపోతే స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు ఓడతారని శ్రేణులంటున్నాయి. మండలంలో పార్టీని చక్కదిద్దేలా చర్యలు తీసుకోవాలని అధిష్టానాన్ని, అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను పార్టీ శ్రేణులు కోరుతున్నాయి.

కీసరగుట్టలో టీడీపీ నాయకుల ప్రత్యేక పూజలు



కీసరగుట్ట ఆలయంలో పూజలు చేస్తున్న తెలుగుదేశం, బీజేపీ నాయకులు

కీసర, జూన్ 5 : కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో తెలుగుదేశం, బీజేపీ పార్టీల నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ కూటమి విజయదుందుభి మోగించినందుకుగానూ, చంద్రబాబునాయుడు నాలుగోసారి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టనున్న సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం టీడీపీ, బీజేపీ నాయకులు స్వామి వారికి పూజలు నిర్వహించారు. చంద్రబాబు నాయడు ప్రజలకు సుపరిపాలన అందించాలని 111 కొబ్బరికాయలు కొట్టారు. కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వెంకటేష్, ఘట్‌కేసర్ మండల అధ్యక్షుడు సంజీవగౌడ్, జంగారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, మహేష్, సురేందర్ రెడ్డి, ఉమాశంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

పరిగిలో సంబురాలు

పరిగి : ఏపీలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు భారీ మెజార్టీతో విజయం సాధించి చరిత్ర సృష్టించడాన్ని హర్షిస్తూ, పరిగిలో టీడీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. పరిగి మాజీ జడ్పీటీసీ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పి.చంద్రయ్య ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుపుకున్నారు. కార్యకర్తలు, అభిమానులు చంద్రయ్య నివాసానికి వచ్చి సన్మానించి, స్వీట్లు తినిపించుకున్నారు. చంద్రబాబు నాల్గోసారి సీఎంగా బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భంగా పరిగిలో చంద్రయ్య పార్టీ శ్రేణులు, అభిమానాలకు భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబునాయుడు నాలుగో సారి సీఎంగా ఎన్నికకావడం సంతోషంగా ఉందన్నారు. టీడీపీ ఆవిర్భావం వల్లే రెండు రాష్ట్రాల్లో బడుగు వర్గాల్లో రాజకీయ చైతన్యం వచ్చిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, అభిమానులు కె.హన్మంతు, ఇ.కృష్ణ, మల్లేశ్, ముజీబురెహమాన్, ముజీబ్, నర్సిరెడ్డి, కె.కిష్టయ్య, రాంచంద్రయ్యగౌడ్, ఆశన్నగౌడ్, వెంకటయ్య, బాలరాజు, చిన్నయ్య, సిద్దిరాములు, నాగయ్య, యూసుఫ్, నసీమొద్దీన్ పాల్గొన్నారు.



స్థానికులకు అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకుడు చంద్రయ్య



లెనీనను అభినందిస్తున్న అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్

నీట్ ర్యాంకర్ లెనీనను సన్మానించిన అసెంబ్లీ స్పీకర్

వికారాబాద్, జూన్ 5 : నీట్‌లో మంచి మార్కులు స్కోర్ చేసిన వికారాబాద్ పట్టణానికి చెందిన లెనీనను అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అభినందించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు పీలారం మల్లేశం కూతురు లెనీన నీట్‌లో 548 మార్కులు సాధించింది. ఈ విషయం తెలుసుకున్న అసెంబ్లీ స్పీకర్ బుధవారం లెనీనను తన క్యాంప్ కార్యాలయానికి పిలిపించారు. ఈ సందర్భంగా ఆమెను ఆయన సన్మానించి అభినందించారు. ఇంత వరకు ప ట్టుదలతో చదివినట్లుగానే ఎంబీబీఎస్, ఆపై ఉన్నత చదువులు చదవాలని ఆయన ఆమెకు సూచించారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత



విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న న్యాయవాదులు

కొడంగల్ రూరల్, జూన్ 5: కొడంగల్‌లోని నవీన ఆదర్శ హైస్కూల్‌లో 45 రోజుల పాటు స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు నిర్వహించారు. కోర్సును పూర్తిచేసుకున్న విద్యార్థులకు బుధవారం డీవీ.నరేశ్‌రాజ్ వైద్యుడు రవీంద్రయాదవ్, లక్ష్మీనారాయణగుప్తా, ప్రిన్సిపాల్ డీవీ.నరేశ్‌రాజ్, న్యాయవాది రమేశ్, సురేశ్‌గౌడ్‌లు సర్టిఫికెట్లను అందజేశారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్



ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీ నిర్వహిస్తున్న ఏవో వసంత, పోలీసులు

మర్పల్లి, జూన్ 5 : ఫర్టిలైజర్స్ దుకాణాల్లో అనుమతి లేని విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తామని మండల వ్యవసాయ అధికారి వసంత అన్నారు. బుధవారం మర్పల్లిలో పోలీసులతో కలిసి ఫర్టిలైజర్స్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన విత్తనాలే విక్రయించాలని, రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని సూచించారు. దుకాణాల్లో స్టాకు, విత్తనాలు, ఎరువుల గురించి బోర్డుపై పెట్టాలన్నారు. అనుమతి లేని విత్తనాలు, నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు ఏ విత్తనాలు కోరితే అవే విత్తనాలే ఇవ్వాలని, కొత్త కొత్త కంపెనీలతో విత్తనాలను అంటగడితే సహించేది లేదన్నారు. ఈ సందర్భంగా మర్పల్లి పోలీసులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



మహదేవ శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొడంగల్, జూన్ 5: మాస శివరాత్రిని పురస్కరించుకొని బుధవారం కొడంగల్‌లోని మహదేవ శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగానికి అభిషేకం చేశారు. భజన మండలి సభ్యులు భజనలు నిర్వహించారు. పూజారులు భక్తులకు ప్రసాదం పంచారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పూర్తి చేయాలి



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో వెంకన్నగౌడ్

బొంరాస్‌పేట్, జూన్ 5: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులను త్వరితగతిన పూర్తి చేయాలని బొంరాస్‌పేట్ ఎంపీడీవో వెంకన్నగౌడ్ తెలిపారు. బుధవారం మండలంలోని ఎన్కెపల్లి, వడిచర్ల, కొత్తూర్, ఏనమీదితండాలో ఆయన అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను పరిశీలించారు. అదే విధంగా ఆయా గ్రామాల్లో నర్సరీలను పరిశీలించి హరితహారంలో మొక్కలను నాటేందుకు సిద్ధం చేయాలని సూచించారు.

క్రైం కార్నర్

ఇంట్లోకి దూసుకెళ్లిన లారీ.. తప్పిన ముప్పు



లారీ ఢీకొనడంతో కూలిన ఇంటి గోడ

పరిగి, జూన్ 5 : నిద్ర మత్తులో లారీ డ్రైవర్ వాహనాన్న ఓ ఇంటిపైకి తీసుకెళ్లాడు. ఇళ్లు దెబ్బ తినగా ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. త్రుటిలో ముప్పు తప్పింది. లారీ(ఏపీ26 వై7778) బుధవారం తెల్లవారుజామున పైపుల లోడ్‌తో కొడంగల్ వైపు వెళ్తోంది. డ్రైవర్ మహేశ్ నిద్ర మత్తులో నడిని లారీని రోడ్డు పక్కన ఉన్న రవి అనే వ్యక్తి ఇంట్లోకి తోలాడు. ఇంటి గోడలు, కిరాణ సామగ్రి ధ్వంసమైంది. తనకు 5లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. ఈ ప్రమాదంలో రవి,పోచయ్య అనే ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. పరిగి ఎస్ఐ సంతోష్ సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.